క్లుప్తంగా

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: పట్టణంలోని రాజావీధిలో త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథంపై ప్రబోధ సేవా సమితీ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. శివరాత్రి జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానాన్ని తెలియజేయడమని సమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు ప్రజలకు వివరించారు. రామచంద్రుడు, మునిదాసు, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, మద్దిలేటి, చక్రపాణి పాల్గొన్నారు.

బరక సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మిడుతూరు: అమావాస్య సందర్భంగా రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీబరకసంజీవరాయస్వామికి ఆదివారం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మన్యుసుక్త హోమం, స్వామివార్లకు పల్లకీ సేవ జరిగింది. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గుండం రఘునాథరెడ్డి, గుండం రామలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవి యాదవ్

నందికొట్కూరు రూరల్: మండలంలోని బిజినవేముల గ్రామంలో కాశీ చంద్రమౌళీశ్వరస్వామి తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ఆదివారం హోరాహోరిగా సాగాయి. పోటీలను సర్పంచ్ రవి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పోటీలు నిర్వహించడం వల్ల రైతులకు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విజేతలకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుదాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పబ్బతి రవి, నాయకులు బద్దుల శ్రీకాంత్, జబ్బార్ పాల్గొన్నారు.

శంకరమల్లేశ్వరుని ఆదాయం రూ.1.10 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినం ముగియడంతో తూడిచెర్ల గ్రామంలోని శ్రీశంకరమల్లేశ్వరస్వామివారి హుండీ కానుకలను ఆదివారం లెక్కించారు. ఇందులో రూ.1,10,870 నగదు, 4 గ్రాముల బంగారం వచ్చినట్లు ఆలయ ఈఓ జనార్ధన్‌శెట్టి తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.15 వేలు అధికంగా వచ్చినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లుయాదవ్, వేణుగోపాల్‌యాదవ్, నాగేంద్రగౌడు, అర్చకులు నాగయ్యశర్మ, సంపత్‌కుమార్, తెలుగు వెంకటేశ్వర్లు, పుల్లన్నయాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం



వసంతోత్సవంలో భక్తుల సందడి

జూపాడుబంగ్లా: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తూడిచెర్ల గ్రామంలోని శ్రీశంకరమల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవారికి ఆదివారం వసంతోత్సవం నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ పసుపు, కుంకుమ కలిపిన నీళ్లతో చక్రతీర్థస్నానం చేయించారు. భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని నిర్వహించారు.

1,845 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు శనివారం నుంచి ఆదివారం వరకు 1,842 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 882 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం సమయానికి జలాశయంలో 35.9342 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 812.60 అడుగులుగా నమోదైంది.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెలుగోడులో సీసీ రోడ్లు.. నల్లకాల్వ, ఆత్మకూరులో గోడౌన్ల ప్రారంభం



వెలుగోడులో సీసీరోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం వెలుగోడులో నిర్మించిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. పట్టణంలోని వెంగల్‌రెడ్డి నగర్‌లో రూ. 5లక్షలతో వేసిన సీసీరోడ్డు, ఈద్గా వద్ద రూ. 5 లక్షలతో వేసిన సీసీరోడ్డు, లక్ష్మీనగర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో రూ. 7.60లక్షలతో వేసిన సీసీరోడ్డు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. వెలుగోడు వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం పరిధిలో రూ.70 లక్షలతో నిర్మించిన 1000 మెట్రిక్ టన్నుల బహుళ ప్రయోజన సౌకర్య గోదామును ప్రారంభించారు.

చెంచు విద్యార్థుల వసతి గృహాలకు రూ. 10.10 కోట్లు

శ్రీశైలం నియోజకవర్గంలో చెంచు విద్యార్థుల వసతి గృహాల నిర్మాణం కోసం రూ.10.10 కోట్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బండి ఆత్మకూరు నారపురెడ్డి కుంట వద్ద వసతి గృహం కోసం రూ.2.75 కోట్లు, జమ్మినగర్ గట్టు తాండలో 100 మంది చెంచు విద్యార్థుల వసతి గృహాల కోసం రూ.2.75 కోట్లు, బైర్లూటి గూడెంలో 50 మంది విద్యార్థులకు రూ.2.30 కోట్లు, కొట్టాల చెరువులో 50 మంది చెంచు విద్యార్థుల వసతి గృహం కోసం రూ.2.30 కోట్లు పీఎం జన్మన్ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. నంద్యాల జిల్లాలో ఐదు మంజూరైతే శ్రీశైలం నియోజకవర్గంలోనే నాలుగు ఉన్నట్లు చెప్పారు. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే రెండింటికి స్థలాలు కేటాయించామని.. మరో రెండింటికి స్థలాల కోసం జేసీని సంప్రదించామని తెలిపారు. నిర్మాణలు పూర్తయితే విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు సయ్యద్ సులేమాన్, తిరుపంరెడ్డి, ఇలియాస్, వంగాల నాగేశ్వరరెడ్డి, షంషీర్ అలీ, మహ్మద్, రామ్మోహన్‌రెడ్డి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

గోదాముల ప్రారంభం

ఆత్మకూరు పట్టణంలో రూ.80 లక్షలు, నల్లకాల్వ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గోదాములను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెద్దపీట వేసిందని అన్నారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. తెలుగుగంగ, కేసీకెనాల్, సిద్ధాపురం, తెలుగుగంగకు సాగునీరు అందించి పంటలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కురుకుంద శంకర్‌రెడ్డి, నల్లకాల్వ సర్పంచ్ వెంకటరమణ, నాగేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య, బాలస్వామియాదవ్, మౌలాలి పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు

మహానంది: రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, వారి సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానందిలో ఆదివారం రెండో రోజు ఎడ్ల బండ లాగుడు (సబ్‌జూనియర్స్ విభాగం) పోటీలను ఆయన ప్రారంభించారు. నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో జిల్లెల్ల గుటికే నాగిరెడ్డి వృషభాలు, మూడో స్థానంలో బురుజుపల్లి సోహిత్‌రెడ్డి, నాలుగో స్థానంలో కొండపాటూరుకు చెందిన లక్ష్మీనారాయణ, ఐదో స్థానంలో బెస్తవారిపేట రుబెన్ వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.75వేలు ఎంపీపీ బుద్దారెడ్డి యశస్విని, రూ. 60వేలు ద్వారం మాధవరెడ్డి, రూ. 50వేలు ఉలవల ఉపేంద్రకుమార్‌రెడ్డి, రూ. 40వేలు బాయిరెడ్డి నాగార్జునరెడ్డి, రూ. 30వేలు కుంచపు శ్రీనివాసులు, కుంచపు ప్రసాద్ అందించారు. వచ్చే ఏడాది జరిగే సీనియర్ విభాగం విజేతలకు రూ.1.50లక్షలు, రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.40వేల చొప్పున అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, కుంచపు శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, జయసింహారెడ్డి పాల్గొన్నారు.



మహానందిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బసవాపురలో గోడౌన్ ప్రారంభం

మహానంది: మండలంలోని గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురంలో రూ. 75 లక్షలతో నిర్మించిన రైతు సహకార కేంద్రం గోడౌన్‌ను ప్రారంభించారు. అలాగే షాదిఖానా వద్ద బోరుబావి పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ నేత కలర్స్ రవినాథరావును పరామర్శించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఆత్మకూరు: పట్టణంలోని గరీబ్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో కరీముల్లా, లొట్టల మహబూబ్‌బాషా, జుబేదా, ఫ్రూట్స్ సలాం, గోరబాషా, భాస్కర్, నారాయణ సహా 100 కుటుంబాల వారు ఉన్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయకృష్ణ, అంజాద్‌అలీ, చంద్ర, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, భాస్కర్, కలీముల్లా పాల్గొన్నారు.



ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

శ్రీకాళహస్తీశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి దేవస్థానం అర్చకులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న ఏఈఓ మోహన్ దంపతులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శ్రీశైలం దేవస్థానం తరుపున శ్రీకాళహస్తీశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఏఈఓ మోహన్ శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఈఓ ఎస్‌వీ నాగేశ్వరరావు, అర్చకులకు అందజేశారు. శ్రీశైలం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

పుష్పశయనోత్సవం



మహానందిలో పుష్పశయనోత్సవం పూజలు

మహానంది: మహానంది ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి మహానందీశ్వరస్వామికి పుష్పశయనోత్సవం నిర్వహించారు. స్థానిక అలంకార మండపంలో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న నిర్వహణాధికారులు

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం చేరాయి. పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీమ్, రఘుస్వామి ప్రశ్నపత్రాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 370 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. రెండు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోకవరం సెంటర్‌లో 130, కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. వాటికి సంబంధించిన అన్ని సెట్–1 ప్రశ్నపత్రాలు వచ్చాయని, పెట్టెల్లో భద్రపరిచి సీల్‌వేసి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. కాగా ఈనెల 18వతేదీ నుంచి 27వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి.

రమణీయం.. రథోత్సవం



ఓంకారం.. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో ఆదివారం రథోత్సవం వైభవంగా జరిగింది. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. అంతకుముందు ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అభిషేకాలు, అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ పరిసరాల్లో రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాశీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో..

నందికొట్కూరు రూరల్: మండలంలోని బిజినవేముల గ్రామంలో శ్రీకాశీ చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. కార్యక్రమానికి ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరయ్యారు. బిజినవేముల సర్పంచ్ రవియాదవ్ ఆయన స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నారీ లోకానికి ఆదర్శం.. సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాములపాడు: బాలికా విద్యకు నాంది పలికిన సావిత్రీబాయి పూలే నారీ లోకానికి ఆదర్శనీయురాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. స్థానిక వివేకానంద విద్యావిహార్ హై స్కూల్‌లో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1848లో అహ్మదా నగర్‌లో భర్త జ్యోతిరావుపూలే ప్రోత్సాహంతో మొదటిసారిగా బాలికల పాఠశాలను ప్రారంభించిన సామాజిక ఉద్యమరాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ స్కూలు డైరెక్టర్ దేవిక, జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు

నందికొట్కూరు: వేసవిలో పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు బోరు వేస్తునట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 18, 19వ వార్డుల్లో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు బోరు పనులను ఆయన ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 19వ వార్డులో స్పెషల్ ప్యాకేజీ కింద, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.46 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం పనులు చేసినట్లు చెప్పారు. అలాగే డ్రైనేజీ నిర్మాణ పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రాల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్రారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్, రంగారెడ్డి, మహేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, తిరుపాలు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే

- ఓటర్ల కాళ్లకైనా మొక్కుతా.. బ్రోకర్ రాజకీయాలు చేయను
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం
- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



హాజరైన బూత్ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే సంస్కృతి తనది కాదని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో నందికొట్కూరు నియోజకవర్గస్థాయి బూత్ కమిటీ, ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తపల్లి, పాములపాడు మండలాల వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తనను కష్టాలు వెంటాడుతుంటే సీఎం వైఎస్ జగన్ ఆదరించారని తెలిపారు. తనకు వైఎస్సార్‌సీపీ కుటుంబం అండగా ఉందని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు ఆయన వెంటే ఉంటానని స్పష్టం చేశారు. బైరెడ్డి శబరికి టీడీపీలో టికెట్ ఇచ్చినా మన ఓట్లు జగనన్నకే పడాలని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ఓటు అడుగుతున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. 2014 ఎన్నికల ముందు 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. ఓటర్ల కాళ్లకైనా మొక్కుతా కానీ బ్రోకర్ రాజకీయాలు చేయలేనని స్పష్టం చేశారు. ఎందరు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ మంచిని ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని గడప గడపకూ వెళ్లి చెప్పాలన్నారు. పేదవాడి భవిష్యత్తు బాగుండాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామలింగేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాయకులు నాగరాజు, అశోక్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, పుల్యాల నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బంగారు, నాగేషులు, నారాయణరెడ్డి, మాబాషా, నాగ ఎల్లయ్య పాల్గొన్నారు.

కార్యకర్తల బలం.. సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

మిడుతూరు: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తల బలం, సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని..మళ్లీ తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మిడుతూరు మండలం పీరుసాహెబ్ పేట గ్రామంలో సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం బీసీ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నవరత్నాల పథకం ద్వారా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గంలో భారీ విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు నీరు చెట్టు పథకం, దోమలపై దండయాత్ర పేరుతో టీడీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. సిద్ధార్థరెడ్డి సమక్షంలో పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన యిడమకంటి రామకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి, పీరుసాహెబ్‌పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి నాయకులు తువ్వా శివరామకృష్ణారెడ్డి, లోకేశ్వరరెడ్డి, రెడ్డివారి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

జూపాడుబంగ్లా: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ మేరీజయంతి వివరాల మేరకు.. మిడ్తూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన శివశంకర్(25), బాబురావుతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం తూడిచెర్ల గ్రామంలోని శివరాత్రి ఉత్సవాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. బాబురావుకు చెయ్యి విరగ్గా, బైక్ నడుపుతున్న శివశంకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుజన తెలిపారు. విద్యార్థులు ఏదేని గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 తేదీలోపు జన్మించిన వారు అర్హులన్నారు. ఈనెలాఖరులోగా www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కాపీలను స్థానిక ఆదర్శ పాఠశాలలో సమర్పించాలని కోరారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చే మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9000722518 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

పాములపాడు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 7గంటలకు రుద్రవరం, సాయంత్రం 4 గంటలకు మిట్టకందాల గ్రామాల్లో పార్టీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ దారా పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన రామచంద్రుడు తన ద్విచక్రవాహనంపై మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. మిడుతూరు నుంచి సుంకేసుల గ్రామానికి అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. 48 బాటిళ్లను స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష



ప్రవేశ కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

జూపాడుబంగ్లా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలతో పాటు, కర్నూలు, ఎమ్మిగనూరు, డోన్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయడానికి ఉదయాన్నే పరీక్ష కేంద్రానికి తల్లిదండ్రులతో తరలివచ్చారు. ఉదయం 10గంటలకు ఐదో తరగతి ప్రవేశపరీక్ష ప్రారంభమైంది. పరీక్ష కేంద్రం చీఫ్‌గా పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణమ్మూర్తి, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా చింతలయ్య బాధ్యతలు నిర్వర్తించారు. రామసుబ్బారెడ్డి అబ్‌జర్వర్‌గా ఉంటూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 790 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 566 మంది మాత్రమే హాజరయ్యారు. 244 మంది గైర్హాజరైనట్లు సత్యనారాయణమ్మూర్తి తెలిపారు. అలాగే 563 మంది విద్యార్థులు ఇంటర్ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉండగా 488మంది మాత్రమే హాజరయ్యారని.. 75మంది గైర్హాజరైనట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద రూం నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు